# కుంతల

చలసాని వసుమతి





# కుంతల

చలసాని వసుమతి

# పరిచయము

‘‘కుంతల’’ శ్రీమతి వసుమతీ దేవి మొదటి నవల.

మొదటి నవల అనగానే కొండంత ఉత్సాహము కలిగినా, నలుసంతైనా సందేహం రాకమానదు. వాసన చూడనట్టి ప్రసవములోనూ, సూచి విన్యాసమెరుగని రత్నంలోనూ, ఉండే నవ్యతను మనము మొదటి నవలలో చూడగలమనే ఆశ ఉత్సాహాన్ని కలిగిస్తుంది. కానీ ఆ ఉత్సాహాన్ని రవంత వెనుకకు లాగే సందేహము రచయిత్రి రచనా నైపుణ్యాన్ని గురించి, ఏ పని అయినా అనుభవము మీదటనే రాణిస్తుంది కదా! వీరికి అనుభవము తక్కువ అనే కారణంగా సాహిత్యరీత్యా ఈ రచన ఉత్తమ స్థాయినందు కోలేదేమో అనే భీతి రాకమానదు. కానీ ప్రస్తుత రచనను కొంత సానుభూతితో చదివే, చదువరీ విమర్శకులు కూడా కొన్ని పుటలు చదివే లోపుగానే అటువంటి భీతి కారణము లేదని తెలుసుకుంటారు. ఆ తరువాత ఉత్సాహమే క్రమ్మి వేస్తుంది.

ఆ మధ్య బ్రిటిష్ ‘బ్రాడ్‌కాస్టింగ్’ సంస్థవారు కొందరు ప్రఖ్యాత రచయితలను నేను ఎందుకు రచయిస్తున్నాను? అనే ప్రశ్నకు సమాధానం చెపుతూ ప్రసంగించమన్నారు. వారిలో ఒకరి ప్రసంగానికి చివరి మాటలు అర్థం ఇలా ఉన్నది ‘నేను ఎందుకు రచిస్తానా..?’ చదువరి కోసం కాదు – నా కోసము, నా ఆత్మసంతోషము కొరకు రచించుకుంటాను. నా రచన నానాటికి మరింత రమ్యంగా, అతిశయిల్లాలని, ఆశిస్తూ, ప్రతిసారి,

అనుకున్న అంతస్తును అందుకోలేకపోతూ.. నా రచనలను ఎవరూ చదవటం లేదు.. అని తెలియవచ్చినా, నేను వ్రాస్తానా? 'రచింపనేమో' కానీ అప్పటికే నా మెదడులో ఇంకా సాగుతూనే ఉంటుంది. ఆ నాటకంలో ఈ పాత్ర శ్రీమతి వసుమతీ దేవికి చెందుతుందని నా విశ్వాసము.

'సమకాలిక ప్రజాజీవితానికి అద్దము వంటిది నవల' – అని ఒక నిర్వచనము. ఆ దృష్టితో చూస్తే 'కుంతల' నేటి మన సాంఘిక పరిస్థితులను చక్కగా ప్రతిబింబిస్తుంది.. అనవచ్చును. ఈ ప్రతిబింబించుటలో, కొందరు వ్యక్తుల, విచిత్ర ప్రవర్తనగా ఉన్నప్పుడు మన ఈ రచన ద్వారా అటువంటి విచిత్ర ప్రవర్తనను మాన్పగలవా? అనే ప్రశ్నను గురించి వేరు వేరు అభిప్రాయాలకు ఎంతైనా అవకాశమున్నది.

ప్రఖ్యాత కళావిమర్శకుడు ఆస్కర్ వైల్డు ఒక సందర్భంలో కళను గురించి అనిన మాట సాహిత్యానికి వర్తిస్తుంది. All Art is Useless కళ పూర్తిగా నిష్ఫలమేనని. ఈ మాట కొంత విభ్రాంతిని కలిగించవచ్చును. ఆస్కర్ నిర్వచన అంతరార్థమేమిటంటే ఉత్తమ కళాకారుడు తన స్పష్టమైన ప్రయోజనముకొరకు కళారూపాలను సృష్టించడు అని. అతడు చేసే కృషి పూర్తిగా ఆత్మవికాసము కోసమూ, ఆత్మ సంతృప్తికోసమూను. ఆ కృషిలో నిజమైన విలువ వుంటే సహృదయయులకున్నూ ఆత్మ వికాసము కలుగుతుంది. నేననుకోవడము సాహిత్యరంగంలోనూ ఈ అభిప్రాయము వర్తిస్తుందని. ఈ నవలా రచన పూర్తిగా ఆత్మవికాసముకోసమే, ఆత్మ సంతృప్తికోసమే సాగినదనుకోవడము నాకు

ఏదో కొంత ఆత్మ విశ్వాసము కలిగితే ఈ రచనకు మరింత ధన్యమవుతుంది. ఇప్పటి నీరస పరిస్థితులలో ఇంతటి ఆసక్తి పూరిత రచన అదీ మొదటి నవలగా అవతరించటం మిక్కిలి ముదావహమైన విషయము.

ఆచంట జానకీరామ్...

# నాలుగు ముక్కలు

ఈ నవల వ్రాసిన ఆమె హృదయానికి, నా హృదయానికి బాంధవ్యం. ఆ బాంధవ్యాన్ని పురస్కరించుకుని ఏవో నాలుగు ముక్కలు హృదయంలోని స్నేహ మాధుర్యంతో రంగరించి వ్రాయమంది. ''సరే'' అని తల వగ్గాను ఆ ప్రేమశాసనానికి.

ఈ నవలలోని అనేక పాత్రలు వాస్తవ జీవితంలోని వ్యక్తులకు ప్రతిబింబాలు. అలా అని ఇది వాస్తవానికి కేవలం అనుకరణ అంటే అదీ కాదు. వాస్తవానికి కల్పన జతగూడింది. కళా సృష్టి చేసే సందర్భంలో కేవలం సృష్టిని అనుకరించడం ఆరంభిస్తే అది కళే అన్పించుకోదు. కేవలం సృష్టి అనుకరణ కళయొక్క ధర్మం కాదు. కళాసృష్టి నిర్మాణ క్రమమంలో రసస్రష్టతాను అనుభవించినదానికి ప్రతిభా విశేషం. ఈ రెండింటినీ సౌందర్యంతో పరిపూర్ణంగా మేళవించటమే కళ. ఈ నవలలో వాస్తవికత విషయాల క్రోడీకరణేకాక రచయిత్రి తానివ్వదలుచుకున్న వ్యాఖ్యానాన్ని కూడా అంతస్సూత్రంగా ఇమిడ్చి రచన సాగించింది.

ఈ నవలలోని పాత్రలనేకం రచయిత్రి జీవిత చరిత్ర పుటలలో మసలుతున్న వ్యక్తులే. ఇక్కడ మరొక్క విషయం వుంది. వాస్తవిక స్పర్శలేని కల్పన అంటూ లేనేలేదు. చిరవరకు ఉత్ప్రేక్ష అలంకారంలో కూడా వాస్తవిక గంధం అంతో ఇంతో వుంటుంది. ''కుంతల''లోని అన్ని పాత్రలు వాస్తవిక జీవితంలోని రూపాలే. అయినా క్రొత్త రూపాలను, క్రొత్త క్రొత్త వ్యక్తిత్వాలను సంతరించుకుని మనకు దర్శనమిస్తాయి. ఇక్కడనే రచయిత్రి వైచిత్రి రచనా రంగంలోను వచనా రూపం ఇచ్చి

విశ్వజనీరాజనం సార్వకాలికం చేసేందుకు ఈ ప్రక్రియ అవసరం అవుతుంది. అలా రచయిత చేతులలో వాస్తవిక వ్యక్తులు కొన్ని లక్షణాలు పోగొట్టుకుని, కొన్ని క్రొత్త లక్షణాలు రాబట్టుకుని, వినూత్నగతిలో మలచబడతారు. అలాగే ఈ నవలలోను మలచబడిన పాత్రలు సజీవంగా కళ్ళముందు మెదులుతాయి.

''కుంతల''లోని పాత్రలను గురించి పేరుపేరునా ఇక్కడ రూపాలకన్నా హృదయాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తాయి. మరికొన్ని పాత్రలు రూపాయిలతోనే మనష్యుల విలువలను కట్టి జీవితాలతో చెలగాటాలాడుకుంటాయి. ప్రేమభావంతో స్నిగ్ధ హృదయంతో సర్వార్పణం చేసుకునే వ్యక్తులూ వున్నారు. ప్రేమ నటించి, ప్రేమకన్నా వాళ్ళకు విలువైన రూపాయిల సంగతి వచ్చేటప్పటికి సన్నిహితమైన వ్యక్తులనే అగాధంలోనికి తోసేసి దూరతీరాలలో అదృశ్యమయిపోయే వ్యక్తులూ ఇందులో కన్పిస్తారు. ''కుంతల'' చదివటం ప్రారంభించండి. ఎవరు ఎవరో పోల్చుకోండి. నాలుగు పేరాలుగా రూపొందిన నా హృదయంలో స్పందించిన నాలుగు ముక్కలూ ఇవే.

విశ్వావసు  శ్రీధరబాబు....

కార్తీక పూర్ణిమ  ''విజ్ఞాన మందిరం''

# కుంతల

పచ్చటి పొలాలపై మంచుతెరల నీడలలో నుండి తొంగి చూచే ఉషోదయం గమనించే భాగ్యం పట్టణాలలో లేదనే సత్యాన్ని నిరూపిస్తూ ఎవరికి వారే కొంపలు మునిగిపోయేట్లు పరిగెడుతున్నారు. మహానగర వీధుల్లో, అల్ప హృదయుని కోరికల్లా తారురోడ్డుపై భాగ్యవంతుల వాహనాలు జారిపోతున్నాయి చిందులేస్తూ.

హాస్పిటల్ పాలరాయి సూర్యోదయ కిరణాలను అలంకరించుకుని సోయగాలను చిమ్ముతోంది. 'కుంతల' డిస్పెన్సరీ దగ్గర కారు ఆపిన డాక్టర్ సునీతను చూస్తూనే డాక్టర్ మల్లిక్, డాక్టర్ సమత ఆనందంతో ఆహ్వానించారు.

'ఏమిటో సమతా! అలవాటయిపోయింది. ఇక్కడకు రాకుండా హాస్పిటల్‌కు వెళ్ళినా మనసిక్కడే ఉండి పోయింది.' హాలులో ఎన్‌లార్జ్ చేయబడిన అక్క కుంతల ఫోటోకు చేసిన అలంకరణను చూస్తూ పరధ్యానంగా అంది సునీత.

అక్క ఆశీర్వాదముంటే మనకు ఎప్పుడూ అపజయము ఉండదన్నా! అదీగాక సమత ప్రేమమయి కావటం, మన అదృష్టం, నీ భాగ్యం అవునా అన్నయ్యా! కొంటెగా అంది సునీత వదినను ఆటపట్టిస్తూ.

నిష్కపటము, నిరాడంబరత, ఇట్టే ఆకర్షించే అందము, సజ్జనశీలి అయిన మల్లిక్‌ను, ఎన్ని జన్మలకైనా అన్నగానే ఉండాలని మరొకసారి ప్రార్థించుకుంది సునీత. అక్కలాగానే తనను ప్రేమిస్తూ, తన సలహాలను తీసుకుంటూ నిర్మల స్వభావంతో ప్రేమించే సునీత అంటే తనకెంతో ఇష్టం.

అందుకే ఇద్దరూ తన దగ్గర ఉండాలని ఇక్కడ జనరల్ హాస్పిటల్‌కు ట్రాన్స్‌ఫర్ చేయించుకున్నారు. అన్న వదిన, అక్క లేని లోటును తీరుస్తూ స్నేహామృతంలో ప్రేమాప్యాయతలను రంగరించి, తన జీవితానికి నూతనోత్సహాన్ని ఇస్తున్నారు. 'కుంతల' అనే బంగారు అక్షరాలు మరొకసారి తృప్తితీర చదువుకొని, భక్తి, ప్రేమ కలిసిన గౌరవంతో, అక్కవైపు చూస్తూ తృప్తిగా అంజలి సమర్పించుకొని, వాచీ చూస్తూ సునీత.

'టైమ్ అయిపోయిందన్నా! సునీతా! సాయంత్రం ప్రోగ్రామ్ మరచిపోకు, అన్నయ్యను ఏడ్పించకు.. మరి వస్తాను..'

కారు స్టార్టు చేసి, నవ్వుకుంటూ వెళ్ళే సమతను, చూస్తూ డాక్టర్ మల్లిక్, డాక్టర్ సునీత వెనుదిరిగారు. నవ్వుతూ పలుకరించే అక్క కుంతల ఫోటోకు ప్రేమగా నమస్సులందించారు.

ఉదారము, సుగుణ సంపత్తితో, సహనం చూపించే సమత అంటే అందరికీ ఎంతో ఇష్టం.

సమత చిరునవ్వుతో ప్రతిగా విష్ చేసి నర్సు అందించిన స్టెత్ తీసుకుని వార్డుకు వెళ్ళి ప్రేమతో తన పేషెంట్లను పలుకరించసాగింది.

'డాక్టర్! డాక్టర్! సీరియస్ కేస్..' హడావుడిగా పిలిచింది నర్సు.

'ఓ.కే..' అంటూ అనుసరించింది నర్సును సమత. బల్లపై ఉన్న పేషెంట్‌ను చూసి షాక్ తిన్నట్లయింది. ఎనిమిది సంవత్సరాల తరువాత మొదటి పర్యాయం గుండె దడదడలాడింది. స్తబ్ధంగా ఊపిరి బిగబట్టి తన బాధ్యతను స్మృతికి తెచ్చుకుని అటూ ఇటూ సూక్ష్మంగా పరికిస్తూ అక్కడే నిలబడి తన వైపే ఆశ్చర్యంగా చూస్తున్న నర్సుతో తడబడుతూ –

'కుంతలా డిస్పెన్సరీకి ఫోన్ చేసి, సమత, మల్లిక్‌లను వెంటనే రమ్మన్నానని చెప్పు' అని ఆజ్ఞాపించి చిరుచెమటలను జేబురుమాలుతో అద్దుకుమటూ, స్మృతి హీనమైన పేషెంటును పరిశీలించసాగింది. 'ఎంత మార్పు! ఆ ఆకర్షించే సుందరమైన ముఖమేది? మధువును గుమ్మరించే ఆ అధరాలేవి? పాలిపోయి, గడ్డం పెరిగి మాసిన దుస్తులతో ఉన్న ఈ పరిస్థితేమిటి? లక్షాధికారి! ఏమిటిలా? గబగబా పరీక్ష చేసిన సమత ఆలోచనలు ఆగిపోయాయి. అందమైన కనుబొమలు విషాదంతో ముడుచుకున్నాయి. రక్తనాళాలు త్రెగిపోయాయని గమనించింది సమత. వాంతి చేసుకున్న రఘు నోటి నుండి రక్తం ఇంకా కారుతూనే ఉంది. మురికిగా గడ్డకట్టిన నల్లటి మరకలు ఇంకా భయంకరం చేస్తున్నాయి. ఇంజక్షన్ చేసి పరీక్షగా చూస్తూ నిలబడింది గత స్మృతుల తాకిడితో బాధపడుతూ సమత .

ఆ! కలువరిస్తున్నాడు! ఉలిక్కిపడింది. 'అవును! పొరపడ్డాను శ్రీదేవి! పొరబడ్డాను. అనురాగం, ప్రేమ, ఆప్యాయత వీటి అర్థాలను మాత్రమే తెలుసుకొని అనుభవాన్ని విసిరివేశాను. అవును. విసిరివేశాను కుంతలా! విసిరివేశాను.'

మరింత తృళ్ళిపడిన సమత 'ఏమిటిది? అక్క గుర్తుందన్నమాట! పశ్చాత్తాపమా! అయితే ఈ జన్మలోనే శిక్ష కూడా ఉంటుందన్న నగ్నసత్యం అర్థమయింది' చెమర్చిన కళ్ళు వత్తుకుంది సమత.

ఆయాసంతో గిలగిలలాడుతున్నాడు రఘు. 'కుంతలా! ఎక్కడున్నావు? నీ ముగ్ధ ప్రేమ లాలిత్యం ఎక్కడ కుంతలా! ఎక్కడ? ఏదీ

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=2252**

* * *

**Read other books of Chalasani Vasumathi @**

**http://kinige.com/kbrowse.php?via=author&name=Chalasani+Vasumathi&id=818**